క్లుప్తంగా

స్మృతివనం సందర్శన



విజయవాడలో అంబేడ్కర్ స్మృతివనంలో జాతీయ నాయకుల విగ్రహాలను చూస్తున్న ఎమ్మెల్యే

రావులపాలెం: సామాజిక న్యాయ మహాశిల్పంగా విజయవాడ నడిబొడ్డున ఏర్పాటు చేసిన 125 అడుగుల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కాంస్య విగ్రహాన్ని, ఆయన స్మృతి వనాన్ని శుక్రవారం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక న్యాయానికి ప్రతిరూపం అయిన అంబేడ్కర్, ఆయన స్మృతి వనాన్ని సందర్శించడం చాలా ఆనందంగా ఉందన్నారు.

అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా నడచుకోవాలి



అంబేడ్కర్‌కు నివాళులు అర్పిస్తున్న ఉపాధ్యాయులు

కొత్తపేట: ప్రతి ఒక్కరూ ప్రపంచ మేధావి రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా నడుచుకోవాలని ఆయన భావితరాలకు మార్గదర్శి అని స్థానిక వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కే పెద్దిరాజు అన్నారు. శుక్రవారం కళాశాలలో అంబేడ్కర్ విగ్రహం వద్ద జరిగిన కార్యక్రమంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అధ్యాపకులు కే అంకమ్మ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డిసిహెచ్ పాపారావు తదితరులు పాల్గొన్నారు.

కులగణన సర్వే ప్రారంభం

అంబాజీపేట: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణన కార్యక్రమం అంబాజీపేట మండలంలో శుక్రవారం నుంచి ప్రారంభమైందని ఎంపీడీఓ కె.సత్యనారాయణమూర్తి తెలిపారు. ఈ సర్వే ఈ నెల 28వ తేదీ వరకూ జరుగుతుందన్నారు. ఇప్పటికే పంచాయతీ కార్యదర్శులకు, సచివాలయ ఉద్యోగులకు అధికారులు శిక్షణ ఇచ్చారన్నారు. సర్వేకు వచ్చిన సిబ్బందికి ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

మామిడికుదురు: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ నేతలు సూచించారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్ర శుక్రవారం మొగలికుదురు, గెద్దాడ గ్రామాల్లో జరిగింది. నోడల్ అధికారి కె.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారులు పాల్గొని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ప్రగతిని వివరించారు. గెద్దాడ, మొగలికుదురు సర్పంచులు గుబ్బల గీతాభవాని, కడి అరుణ కుమారి అధ్యక్షతన జరిగిన సమావేశాల్లో నేతలు ఎంఎ వేమా, అడబాల సత్యనారాయణ, చీకురుమిల్లి వెంకటేశ్వరరావు, మెండా ఆదినారాయణ, గాడి సత్తిబాబు, కంకిపాటి సుబ్బారావు, పసుపులేటి మహలక్ష్మీరావు, అడబాల రాంబాబు పాల్గొన్నారు.

వేంకటేశ్వరుని ఆలయం అభివృద్ధి

ఆలమూరు: గుమ్మిలేరులో ఉన్న శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. దాతల సాయం, రూ.20 లక్షల వ్యయంతో చేపట్టిన అభివృద్ధి పనులు పూర్తయ్యాయి. గ్రామానికి చెందిన దివంగత రెడ్డి వెంకట్రావు భార్య లక్ష్మి కాంతం సంరక్షణలో, పర్యవేక్షణలో ప్రస్తుతం దేవతా మూర్తులకు నిత్య పూజలు ధూప దీప నైవేద్యాలు కొనసాగుతున్నాయి. ఆలయ నిర్మాణం జరిగి నాలుగున్నర దశాబ్దాలు పూర్తి కావడంతో ఆలయాభివృద్ధికి ఆమె ప్రత్యేక చర్యలు చేపట్టారు. అందులో భాగంగా ఆమె దాతల సహాయ సహకారాలతో ఆలయం సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఆలయం చుట్టూ భక్తులకు ప్రదక్షిణ మార్గంలో ఇబ్బంది లేకుండా షెల్టర్ నిర్మాణం, టైల్స్ ఏర్పాటుతో పాటు ఆలయం లోపల పలు అభివృద్ధి పనులను పూర్తి చేశారు.

వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి భక్తుల విరాళాలు



దాతకు స్వామి వారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ సిబ్బంది

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ అవరణలో నిర్మిస్తున్న వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి కొయ్యలగూడెంకు చెందిన నాటకసాల వెంకటరాజు, సత్యవతి దంపతులు రూ.60,116, విశాఖపట్నానికి చెందిన టి.శేషుకుమార్, లక్ష్మి దంపతులు రూ.25 వేలు, ఆలమూరు మండలం మూలస్థానానికి చెందిన యూఎల్ఎం వెంకట సూర్యప్రకాష్ రూ.21,720 విరాళం అందించినట్టు ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఆలయ ఈఓ ముదునూరి సత్యనారయణరాజు తెలిపారు. దాతకు ఆలయ సిబ్బంది చేతుల మీదుగా స్వామి వారి చిత్రపటం అందజేశారు.

హుషారుగా ఆడుదాం ఆంధ్రా

- సచివాలయాల పరిధిలో ఆటల పోటీలు
- పరిశీలించిన అధికారులు



పాశర్లపూడిలంకలో క్రికెట్ ఆడుతున్న క్రీడాకారులు



రాజోలులో తలపడుతున్న కబడ్డీ క్రీడాకారులు

రాజోలు: ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి క్రీడా పోటీలు హుషారుగా సాగుతున్నాయి. శుక్రవారం స్థానిక బాలుర ఉన్నత పాఠశాల గ్రౌండ్స్‌లో వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. రాజోలు డిగ్రీ కళాశాల, పొన్నమండ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో క్రికెట్ పోటీలు జరిగాయి. మండల పరిధిలోని 22 సచివాలయాలకు చెందిన జట్లు క్రీడా పోటీల్లో పాల్గొన్నాయి. ఈ నెల 20వ తేదీన మండల స్థాయి ఫైనల్ పోటీలు నిర్వహించనున్నారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన జట్లు ఈ నెల 24న జరిగే నియోజకవర్గ స్థాయి పోటీల్లో పాల్గొంటాయి. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా సీహెచ్ ప్రసాద్, చొప్పల చంద్రశేఖర్, పి.రామకృష్ణ, కె.శ్రీను, బాలకృష్ణ, రాజీవ్, ధర్మశేఖర్ వ్యవహరించారు. రిటైర్డ్ ఎంఈఓ జొన్నలగడ్డ గోపాలకృష్ణ, పంచాయతీ కార్యదర్శి రజని తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడాకారులలో ...

అంబాజీపేట: గ్రామీణ క్రీడాకారులలో అణగారిపోతున్న క్రీడా నైపుణ్యాలను వెలికితీసి వారిని మరింత ప్రోత్సహించాలనే లక్ష్యంతో జగనన్న ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందని ఎంపీడీఓ కె.సత్యనారాయణమూర్తి అన్నారు. అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో జరుగుతున్న ఆడుదాం ఆంధ్రా పోటీలను శుక్రవారం ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా..

ఆలమూరు: ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి క్రీడల్లో భాగంగా రెండో రోజు శుక్రవారం క్రికెట్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. మండలంలోని చొప్పెల్ల, మూలస్థాన అగ్రహారం గ్రామాల్లోని మైదానాల్లో ఎంపీడీఓ కె.జాన్‌లింకన్ నేతృత్వంలో క్రికెట్ పోటీలు జరుగుతున్నాయి. ఈ పోటీలకు 24 జట్లు ప్రాతినిధ్యం వహిస్తుండగా ఇప్పటి వరకూ లీగ్ దశలో పోటీలు పూర్తికాగా శుక్రవారం సెమీఫైనల్ పోటీలు జరిగాయి. శనివారం ఫైనల్ పోటీలను నిర్వహించనున్నట్లు ఎంఈఓలు పి.సాలెంరాజు, ఎస్వీ.సుబ్బరాజు పేర్కొన్నారు.

ఉత్సాహంగా ...

మామిడికుదురు: పాశర్లపూడిలంక ఓఎన్జీసీ గ్రౌండ్‌లో ఆడుదాం ఆంధ్రా క్రికెట్ పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. ఈ పోటీల్లో మండల పరిధిలోని సచివాలయాల నుంచి 22 జట్లు పాల్గొన్నగా నాలుగు జట్లు సెమీ ఫైనల్స్‌కు చేరుకున్నాయి. మొదటి మ్యాచ్ పాశర్లపూడి-1, మొగలికుదురు జట్ల మధ్య జరిగింది. ఈ మ్యాచ్‌లో మొగలికుదురు విజేతగా నిలిచింది. రెండో మ్యాచ్‌లో ఈదరాడ, కొమరాడ తలపడగా ఈదరాడ జట్టు విజయం సాధించింది. పెదపట్నంలంక, పాశర్లపూడిలంక జట్ల మధ్య 3వ మ్యాచ్ జరగ్గా పాశర్లపూడిలంక విజయం సాధించింది. నాలుగో మ్యాచ్ లూటుకుర్రు, నగరం-1 జట్ల మధ్య జరగ్గా లూటుకుర్రు విజేతగా నిలిచిందని మండల స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ మట్టా శ్రీధర్ తెలిపారు. విజయం సాధించిన నాలుగు జట్లు సెమీ ఫైనల్స్‌కు చేరు కున్నాయన్నారు. ఈ నాలుగు జట్ల మధ్య శనివారం సెమీ ఫైనల్స్ మ్యాచ్‌లు జరుగుతాయన్నారు.

విజయవాడ తరలిన పార్టీ శ్రేణులు



రావులపాలెంలో జెండా ఊపి బస్సుయాత్రను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి



విజయవాడ బయలుదేరిన పార్టీ నాయకులు, కార్యకర్తలు



దిండిలో బస్సు యాత్ర ప్రారంభించిన ఎమ్మెల్యే రాపాక వర ప్రసాదరావు

రాజోలు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతి వనం ప్రారంభోత్సవ కార్యక్రమానికి రాజోలు మండలం నుంచి పలు గ్రామాల నుంచి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం తరలివెళ్లారు. తాటిపాక, పొదలాడ, సోంపల్లి, పాలగుమ్మి గ్రామాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు పొదలాడ సెంటరులో ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సులో పయనమయ్యారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీటీసీ సభ్యుడు గెడ్డం సురేష్ మాట్లాడుతూ 19 ఎకరాల్లో రూ.400 కోట్లతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా అంబేడ్కర్ స్మృతి వనం, కాంస్య విగ్రహ నిర్మాణ పనులు దిగ్విజయంగా పూర్తి చేశారన్నారు. అంబేడ్కర్ స్ఫూర్తితో రాష్ట్రంలో సీఎం జగన్ సామాజిక న్యాయ పాలన అందిస్తున్నారన్నారు. పార్టీ నాయకులు కంబాల చంద్రరావు, గెడ్డం సునీల్, తిరుమాని రాజు, బొంతు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పి.గన్నవరం మండలంలో...

పి.గన్నవరం: విజయవాడలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా శుక్రవారం జరిగిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి పి.గన్నవరం నియోజకవర్గం నుంచి పార్టీ ఇన్‌చార్జి విప్పర్తి వేణు గోపాలరావు ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు, అభిమానులు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. బస్సులు, కార్ల ర్యాలీని స్థానిక మూడు రోడ్ల సెంటర్లో విప్పర్తి పార్టీ జెండా ఊపి ప్రారంభించారు. అంతకు ముందు అంబేడ్కర్ విగ్రహానికి ఆయన పూల మాలలు వేసి, నివాళులు అర్పించారు. మండల పార్టీ అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో విప్పర్తి మాట్లాడారు. ఎంపీడీఓ ఎం.భారతి పాల్గొన్నారు. సర్పంచ్ కొంబత్తుల ఏసుబాబు, సొసైటీ చైర్మన్ మెల్లం మహలక్ష్మి ప్రసాద్, పార్టీ నాయకులు అడ్డగళ్ల వెంకట సాయిరామ్, సాధనాల రమేష్, గుత్తుల మధు, కొక్కిరి రవికుమార్, కడలి రమణ, జల్లి శ్రీను, కోట విజయకుమార్, నాగాబత్తుల యువరాజు తదితరులు తరలివెళ్లారు.

మలికిపురం మండలంలో...

మలికిపురం: విజయవాడలో శుక్రవారం జరిగే అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు రాజోలు నియోజకవర్గం నుంచి భారీగా వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, అభిమానులు తరలి వెళ్లారు. నియోజకవర్గంలోని మండలంలోని దిండి బాలయోగి సెంటరుకు చేరుకున్న బస్సులను ఎమ్మెల్యే రాపాక వర ప్రసాదరావు జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయ సాధన కోసం నడుం బిగించిన ఏకైక నాయకులు సీఎం జగన్ అని అన్నారు. నియోజకవర్గం నుంచి సుమారు 24 బస్సుల్లో 1100 మందికి పైగా కార్యకర్తలకు విజయవాడ వెళ్లారు. ఏఎంజీ చైర్మన్ గుబ్బల రోజా రమణి, జెడ్పీటీసీలు బల్ల ప్రసన్న కుమారి, తెన్నిటి కిషోర్, కొల్లబత్తుల అశోక్ కుమార్, ఈద రవి రెడ్డి, మోకా ఉదయ్ భాస్కర్, కుసుమ చంద్ర శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విజయవాడ తరలివెళ్లిన అభిమానులు

ఆలమూరు మండలంలో...

ఆలమూరు: కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాసు ఆధ్వర్యంలో వివిధ గ్రామాల నుంచి వేలాది మంది కార్యకర్తలు, అభిమానులు వాహనాల్లో శుక్రవారం బయలుదేరి వెళ్లారు. బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, సమ సమాజ స్ఫూర్తి, రాజ్యాంగ రూపశిల్పి అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించుకోవడం రాష్ట్రానికే గర్వకారణమని పలువురు నేతలు వ్యాఖ్యానించడం ఆయనపై ప్రజలకున్న అభిమానం తేటతెల్లమవుతోంది.

రావులపాలెం మండలంలో...

రావులపాలెం: అంబేడ్కర్ స్మృతివనం ప్రారంభోత్సవానికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ఆధ్వర్యంలో అంబేడ్కర్ వాదులు, వైఎస్సార్ సీపీ శ్రేణులు శుక్రవారం విజయవాడ తరలివెళ్లారు. కొత్తపేట నియోజకవర్గం నాలుగు మండలాలు రావులపాలెం, కొత్తపేట, ఆలమూరు, ఆత్రేయపురం మండలాల నుంచి రావులపాడు మల్లాయిదొడ్డి జంక్షన్ వద్ద ఉన్న ఖాళీ ప్రాంతానికి చేరుకుని అక్కడ అల్పాహారం తీసుకుని అనంతరం బస్సులు, కారుల్లో విజయవాడకు బయలుదేరారు. తొలుత అంబేడ్కర్ చిత్రపటానికి ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి క్షీరాభిషేకం చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో అముడా చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, కొత్తపేట ఎంపీపీ మార్గన గంగాధరరావు, సర్పంచ్ తమ్మన శ్రీను, వైఎస్సార్‌సీపీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు కప్పల శ్రీధర్ పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి సురక్ష



సూర్యారావుపేటలో సేవలు అందిస్తున్న వైద్యులు

ఆలమూరు: పేద ప్రజల ఆరోగ్య రక్షణకు, మెరుగైన చికిత్సకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జగనన్న ఆరోగ్య సురక్ష (జాస్) ప్రవేశ పెట్టిందని ప్రత్యేక వైద్య నిపుణులు జి.దుర్గాప్రసాద్, మేఘ స్పందన, నేత్ర వైద్య నిపుణురాలు పి.శ్రీలక్ష్మి అన్నారు. మండలం కేంద్రమైన ఆలమూరు-3 పరిధిలోని సూర్యారావుపేటలో సర్పంచ్ చింతపల్లి వెంకటలక్ష్మీ ఆధ్వర్యంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష జరిగింది. పెదపళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు పి.భవానీ శంకర్, డి.సాయి కిషోర్ నేతృత్వంలో వైద్యారోగ్య అధికారులు, సిబ్బంది సుమారు 150 మందికి వైద్య సేవలను అందించి ఉచితంగా మందులను అంద జేశారు. అవసరమైన రోగులకు రక్త పరీక్షలు నిర్వహించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి హరేరామ్ రెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ ఏవివి రాజా, సూపర్వైజర్లు ఎం .శ్రీనివాసరావు, పి.ఉమ, హెల్త్ అసిస్టెంట్లు ఆర్.నాగేశ్వర రావు, వి.సుబ్బారావు, ఆరోగ్య మిత్ర నామాల రామకృష్ణ, ఆరోగ్య ఆశ సిబ్బంది, గ్రామ సచివాలయ ఉద్యోగులు, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆకస్మిక తనిఖీ



పరీక్షలను పరిశీలిస్తున్న డీవీఈఓ సత్యనారాయణరెడ్డి

రావులపాలెం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలను కోనసీమ జిల్లా డీవీఈఓ ఎస్‌వీవీ సత్యనారాయణ రెడ్డి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కళాశాలలో జరుగుతున్న ప్రీ ఫైనల్ పరీక్షల నిర్వహణను ఆయన తనిఖీ చేసి, ప్రతి తరగతి గదికి వెళ్లి పరిశీలించారు. బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ప్రవేశపెట్టిన జయీభవ 50 రోజులు ప్రోగ్రాంకు సంబంధించి ప్రతి అధ్యాపకుడు కొంత మంది విద్యార్థులను దత్తత తీసుకుని, చదివించేలా అధ్యాపకులకు పలు సూచనలు చేశారు. అలాగే పబ్లిక్ పరీక్షలకు తక్కువ సమయం ఉన్నందున ప్లాన్ చేసుకొని చేదువుకొని మంచి మార్కులతో ఉత్తీర్ణత శాతం సాధించాలని కళాశాలకు మంచి పేరు తేవాలన్నారు. కళాశాలలో నాడు - నేడు పనులను పరిశీలించారు. ఆయన వెంట కళాశాల ప్రిన్సిపాల్ పి.గోపాలకృష్ణ తదితరులు ఉన్నారు.

హరిదాసుకు సత్కారం



హరిదాసును సత్కరిస్తున్న యువకులు

రాజోలు: ధనుర్మాసం ప్రారంభం నుంచి ఊరూరా తిరుగుతూ సంకీర్తనలు ఆలపిస్తూ జీవనం సాగించే హరిదాసును శుక్రవారం రాజోలు నాగార్జున స్ట్రీట్ బాల బాలాజీ సంఘ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఆధునిక సమాజంలో అంతరించిపోతున్న సంస్కృతీ, సాంప్రదాయాలను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని సంఘ నాయకుడు గుబ్బల శ్రీనివాస్ అన్నారు. అందుకే తమ సంఘం ఆధ్వర్యంలో హరిదాసును సత్కరించి రూ.3,200 ఆర్థిక సాయం అందజేశారు.

గ్రామాల అభివృద్ధిపై నేడు సమీక్ష

ఆలమూరు: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శనివారం మండలంలోని అన్ని గ్రామాల అభివృద్ధిపై సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ కె.జాన్‌లింకన్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ 2023-24 జరిగిన అభివృద్ధితో పాటు ఈ ఏడాది ఆర్థిక సంవత్సరంలో చేపట్టబోయే పనులు, నిధుల లభ్యతపై చర్చించనున్నామన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు తరలిరావాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అయినవిల్లి: మండలంలోని 400 కేవీ విద్యుత్‌లైన్ పనుల నిమిత్తం శనివారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఎలక్ట్రికల్ ఏఈ వి.శ్రీనివాసు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. రొయ్యచెరువుల యజమానులు, గృహ వినియోగదారులు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు సహకరించాలని ఆయన కోరారు.

బీఎస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా జాన్‌మోసే

మలికిపురం: బీఎస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా విశ్వేశ్వరాయపురం గ్రామానికి చెందిన బూసి జాన్ మోసేను నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు కుసుమ వెంకటేశ్వరరావు ఉత్తర్వులు ఇచ్చారు. ఈ మేరకు జాన్ మోసే శుక్రవారం తెలిపారు. జాన్‌మోసే మాట్లాడుతూ పార్టీ ఆదేశాల ప్రకారం పని చేస్తానని పేర్కొన్నారు.

28న చెడుగుడు పోటీలు

మలికిపురం: శంకరగుప్తం గ్రామంలో ఈ నెల 28వ తేదీన ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల స్థాయిలో చెడుగుడు పోటీలు నిర్వహిస్తున్నట్టు నిర్వాహక కమిటీ సభ్యుడు చింతా కుమారరాజు తెలిపారు. స్థానిక సీసీఎఫ్ సొసైటీ ఆధ్వర్యంలో పోటీలు జరుగుతాయని ఆసక్తి ఉన్నవారు పాల్గొనవచ్చని ఆయన తెలిపారు.

ఘనంగా వేమన జయంతి



వేమన విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న ఉపాధ్యాయులు

రావులపాలెం: ఊబలంక గ్రామంలో వేమన జయంతి సందర్భంగా రెడ్డి కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు పడాల శివరామకృష్ణారెడ్డి, ప్రధానకార్యదర్శి మేడపాటి అమ్మిరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం వేమన చిత్రపటానికి సంఘ సభ్యులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో రెడ్డి సంఘం సభ్యులు పాల్గొన్నారు.

కొత్తపేట: స్థానిక వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం విశ్వకవి వేమన జయంతిని ఘనంగా నిర్వహించారు. వేమన విగ్రహానికి ప్రిన్సిపాల్ కేపీరాజు, వైస్ ప్రిన్సిపాల్ టి.రమాదేవి ఇతర అధ్యాపకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రాజు మాట్లాడుతూ వేమన ప్రజాకవిగా, సంఘ సంస్కర్తగా, కవిగా సమాజానికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్య మెరుగుకు డ్రై డే



పారిశుధ్యాన్ని పరిశీలిస్తున్న వైద్యారోగ్య సిబ్బంది

ఆలమూరు: గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్యం మెరుగుకు ప్రతి శుక్రవారాన్ని పొడివారం(డ్రైడే)గా పాటించాలని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు సువర్చలాదేవి, భవానీశంకర్ కోరారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని ఆరోగ్య, ఆశ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఇంట్లో నిల్వ నీరు ఉంచకూడదని, వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించి మెరుగైన ఆరోగ్యకర సమాజాన్ని నెలకొల్పాలని ప్రజలకు సూచించారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాల్లో ఆరోగ్య, ఆశ సిబ్బంది డ్రై డేను వివరిస్తూ భారీ ర్యాలీలు నిర్వహించారు. సీహెచ్ఓ పి.రాధాకృష్ణ, ఎంపీహెచ్ఈఓ కె.జ్యోతి కుమార్, హెల్త్ ఎడ్యుకేటర్లు ఏవీవీ రాజా, బి.సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివప్రసాద్, పి.ఉమ, ఆర్.బాలమణి తదితరులు వైద్యసేవలను పర్యవేక్షించారు.

పొన్నమండ డ్యామ్ ఎత్తు తగ్గించాలని వినతి

మామిడికుదురు: గోగన్నమఠం గ్రామంతోపాటు ఆ గ్రామ శివారు ముత్యాలపాలానికి సాగునీరు అందించే పొన్నమండ-1 కాలువ డ్యామ్ వద్ద కాలువ కింది భాగంలోని శ్లాబ్ ఎత్తు తగ్గించాలని కోరుతూ స్థానిక రైతులు ఇరిగేషన్ శాఖాధికారులకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. కాలువ కింది భాగంలో ఎత్తు పెంచి శ్లాబ్ వేయడం వల్ల కాలువ శివారు ప్రాంతాలకు సాగు, తాగునీరు, పశువులకు అవసరమైన నీరు సక్రమంగా పారుదలవుతుందన్నారు. కాలువ అడుగు భాగంలో శ్లాబ్‌ను ఆరు అంగళాలు తగ్గించాలని కోరారు. ఈ కాలువ కింద సుమారు 150 ఎకరాల ఆయకట్టు సాగవుతుందన్నారు. దీనిపై అధికారులు తక్షణం స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు. వినతి అందించిన వారిలో రుక్మాంగధరరావు, బీహెచ్ బాలాజీదాస్, ఎస్.సిద్ధార్థరావు, కె.సత్యనారాయణ, పి.రాంబాబు తదితరులు ఉన్నారు.

ఆ 20 కుటుంబాలనూ జాబితాలో చేర్చాలి

మామిడికుదురు: పాశర్లపూడి పల్లవపాలెంలో నిర్మిస్తున్న రైల్వే బ్రిడ్జి నిర్మాణం వల్ల మొత్తం 50 కుటుంబాలు నిరాశ్రయులవుతున్నాయని, అందులో 30 కుటుంబాలకు మాత్రమే ప్రభుత్వం ఆశ్రయం కల్పిస్తోందని మిగిలిన 20 కుటుంబాలను కూడా జాబితాలో చేర్చి వారికి కూడా ఆశ్రయం కల్పించాలని కోరుతూ డెమోక్రటిక్ ట్రెడిషనల్ ఫిష్ వర్కర్స్ ఫోరమ్ శుక్రవారం జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాకు వినతిపత్రం ఇచ్చింది. అమలాపురంలో కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చామని ఫోరమ్ కార్యదర్శి చింతా శ్రీనివాస్ తెలిపారు. దీంతో పాటు రైల్వే బ్రిడ్జి నిర్మాణం వల్ల ఇసుక మేటలు వేయడంతో 24 మత్స్యకార సొసైటీల సభ్యులు జీవనోపాధి కోల్పోతున్నారని, వారికి కూడా న్యాయం చేయాలని కోరింది.

మాదిగలకు జిల్లాలో అవకాశం కల్పించాలి



నేదునూరి రాజేష్

మామిడికుదురు: రాబోయే ఎన్నికల్లో జిల్లాలో మాదిగలకు టిక్కెట్ కేటాయించి రాజకీయ ప్రాధాన్యత కల్పించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి నేదునూరి రాజేష్ డిమాండ్ చేశారు. ఆయన శుక్రవారం విలేకర్లతో మాట్లాడుతూ జిల్లాలో ఒక పార్లమెంటు, మూడు అసెంబ్లీ స్థానాలు ఎస్సీలకు రిజర్వు చేసినప్పటికీ మాదిగలను రాజకీయ పార్టీలు కేవలం ఓటు బ్యాంకు గానే వాడుకుంటున్నాయన్నారు.

వేధింపులపై ఫిర్యాదు

అయినవిల్లి: స్థానిక పీహెచ్‌సీకి చెందిన ల్యాబ్ టెక్నీషియన్ తనను వేధిస్తున్నాడని విలస సబ్‌సెంటర్ ఎంఎల్‌హెచ్‌పీగా పనిచేస్తున్న మహిళ అయినవిల్లి పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేసింది. దీనికి సంబంధించి స్థానిక ఎస్సై కె.సురేష్‌బాబు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని విలస గ్రామ సబ్‌సెంటర్‌లో ఎంఎల్‌హెచ్‌పీగా పనిచేస్తున్న మహిళను అయినవిల్లి పీహెచ్‌సీలో ల్యాబ్‌టెక్నీషియన్‌గా పని చేస్తున్న కడలి శ్రీనివాస్ ప్రేమిస్తున్నానంటూ వేధింపులకు గురి చేస్తున్నాడని, అసభ్య పదజాలంతో దూషించాడని, తన సెల్ ఫోన్ వాట్సప్‌కు అసభ్యకరమైన మెసేజ్‌లు పంపించాడని అయినవిల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.